క్లుప్తంగా

జగనన్న ఆరోగ్య సురక్షతో ఆరోగ్య భద్రత


నేత్రరోగులకు కళ్లజోళ్లు అందజేస్తున్న ఎంపీపీ జయలక్ష్మి

మునగపాక : జగనన్న ఆరోగ్య సురక్ష ద్వారా ప్రతి ఒక్కరికీ ఆరోగ్య భద్రత కలుగుతుందని ఎంపీపీ మళ్ల జయలక్ష్మి పేర్కొన్నారు. ఇటీవల మునగపాక హైస్కూల్‌లో నిర్వహించిన జగనన్న ఆరోగ్య సురక్ష ద్వారా కంటి ఆపరేషన్లు నిర్వహించుకున్న పలువురికి గురువారం ఆమె కళ్లజోళ్లు అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రజల ఆరోగ్యమే పరమావధిగా సీఎం జగన్‌మోహన్‌రెడ్డి భావించి అందుబాటులో వైద్య సేవలు అందిస్తున్నారన్నారు. ఇటువంటి శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. సర్పంచ్ దిమ్మల అప్పారావు, వైఎస్సార్‌సీపీ మండల పార్టీ కన్వీనర్ ఆడారి అచ్చియ్యనాయుడు, సచివాలయ కన్వీనర్ బొడ్డేడ మహేష్ కార్యక్రమంలో పాల్గొన్నారు.

సనాతన ధర్మాన్ని కాపాడుకుందాం


సమరసతా సేవా ఫౌండేషన్ ఆధ్వర్యంలో అవగాహన ర్యాలీ

అచ్యుతాపురం : హరిపాలెం-అందలాపల్లిలో సమరసతా సేవా ఫౌండేషన్ సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా సమరసతా సేవా ఫౌండేషన్ యలమంచిలి ఖండ సంయోజకులు బి.వి.రమణ మాట్లాడుతూ రథసప్తమి రోజున సూర్య భగవానుని పూజించాలని కోరారు. సనాతన ధర్మాన్ని కాపాడేందుకు ఫౌండేషన్ చేస్తున్న కృషికి అందరూ అండగా నిలవాలని కోరారు. ఈ కార్యక్రమంలో కొల్లి అప్పారావు, వరలక్ష్మి, ఆదాయమ్మ, తులసీ, భవాని, కమలమ్మ, అచ్చియమ్మ, పార్వతి పాల్గొన్నారు.

సంపద తయారీ కేంద్రాలను అభివృద్ధి చేయాలి


సత్యవరంలో చెత్త నుండి సంపద కేంద్రాలను పరిశీలిస్తున్న ఈవోఆర్‌డీ

పాయకరావుపేట : గ్రామాల్లో ఏర్పాటు చేసిన చెత్త నుండి సంపద తయారీ కేంద్రాలను సచివాలయ సిబ్బంది అభివృద్ధి చేయాలని ఈవోఆర్‌డీ సిహెచ్.చంద్రశేఖర్ అన్నారు. ఆయన మండలంలో గల పలు గ్రామాల్లో గ్రామ సచివాలయాలను సందర్శించి, సంపద కేంద్రాలను తనిఖీ చేశారు. అనంతరం గ్రామాల్లో ఆరోగ్యశ్రీ కార్డులు పంపిణీ, ఆయుష్మాన్ భారత్ కార్డులు పంపిణీ, ఈకేవైసీ నమోదుపై గ్రామ సచివాలయ కార్యదర్శులతో చర్చించారు.

వైఎస్సార్‌సీపీలోనే ఉన్నాం

రాంబిల్లి : తమ కుటుంబానికి చెందిన వారు ఎవరూ జనసేన పార్టీలో చేరలేదని భోగాపురానికి చెందిన వైఎస్సార్‌సీపీ నాయకుడు అప్పికొండ రమేష్ తెలిపారు. తన సోదరుడు సాంబశివతో కలిసి ఆయన మాట్లాడుతూ, తామంతా జగనన్న అభిమానులమని పేర్కొన్నారు. సాంబ శివ మాట్లాడుతూ, తాను జనసేనలో చేరినట్లు జరుగుతున్న ప్రచారం అవాస్తవమన్నారు. వైఎస్సార్‌సీపీలోనే తాము కొనసాగుతామన్నారు.

ఈవీఎం ఓటింగ్‌పై అవగాహన


తిమ్మాపురంలో ఈవీఎంపై అవగాహన నిర్వహిస్తున్న దృశ్యం

ఎస్.రాయవరం : వచ్చే సార్వత్రిక ఎన్నికల్లో ఉపయోగించే ఈవీఎంల ఓటింగ్ విధానంపై ఓటర్లు విధిగా అవగాహన కలిగించుకోవాలన్నారు. తిమ్మాపురం, కోనవానిపాలెం,గోకులపాడు గ్రామాల్లో పోలింగ్ బూత్‌ల వద్ద గురువారం ఈవీఎం మిషన్‌తో తహసీల్దార్ శ్యామ్‌కుమార్ అవగాహన కార్యక్రమం నిర్వహించారు. పోలింగ్ విధానం నిర్వహించి డెమో నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ కర్రి సత్యనారాయణ, గ్రామపెద్దలు పాల్గొన్నారు.



'పల్లి'ని చేరిన ప్రగతి

- రూ.8.22 కోట్లతో నాగులాపల్లి అభివృద్ధి
- సంక్షేమ పథకాల ద్వారా రూ.21.89 కోట్లు

రెండు సచివాలయాల భవనాలు రూ.80 లక్షలు	రైతు భరోసా కేంద్రం నిర్మాణం రూ.21.8 లక్షలు
జల్‌జీవన్ మిషన్ పనులు రూ.80 లక్షలు	రెండు విలేజ్ హెల్త్ క్లినిక్‌ల ఏర్పాటు రూ.35 లక్షలు
వైఎస్సార్ డిజిటల్ లైబ్రరీ రూ.16 లక్షలు	మనబడి నాడు-నేడు తొలివిడత రూ.85 లక్షలు
మనబడి నాడు-నేడు రెండవ విడత రూ.కోటి 27 లక్షలు	జగనన్న ఇళ్ల నిర్మాణాలకు రూ.2.28 కోట్లు


నాగులాపల్లిలో విలేజ్ హెల్త్ క్లినిక్

మునగపాక : ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి హయాంలో గ్రామాలు అభివృద్ధి పథంలో పయనిస్తున్నాయి. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో పల్లెల స్వరూపాలు మారిపోతున్నాయి. కోట్లాది రూపాయలను అభివృద్ధికి ఖర్చు చేస్తున్నారు. రూ.8.22 కోట్ల వ్యయంతో మండలంలోని నాగులాపల్లి గ్రామంలో అభివృద్ధి పనులు జరిగాయి. దీనికి తోడు సంక్షేమ పథకాల ద్వారా నాగులాపల్లికి రూ.21.80 కోట్ల మేర నేరుగా లబ్ధిదారులకు అందింది.


నాగులాపల్లి టీచర్స్ కాలనీలో నూతనంగా నిర్మించిన రహదారి


నాగులాపల్లిలోని సచివాలయం


నాగులాపల్లి జగనన్న కాలనీలో గృహ ప్రవేశం చేసిన ఇంటిలో గృహిణి

అభివృద్ధి నిధుల వ్యయం ఇలా...

గ్రామ ప్రజలకు సకాలంలో మెరుగైన సేవలందించేందుకు రూ.80 లక్షలతో రెండు సచివాలయాలు, రైతులకు అందుబాటులో ఉండేలా రూ.21.8 లక్షల వ్యయంతో రైతు భరోసా కేంద్రం, గ్రామంలో వైద్య సేవలందించేందుకు వీలుగా రెండు చోట్ల రూ.35లక్షలతో విలేజ్ హెల్త్ క్లినిక్ భవనాలు ప్రభుత్వం నిర్మించింది. రూ.16 లక్షలతో డిజిటల్ లైబ్రరీ, ఇంటింటికీ తాగునీరు అందించేందుకు ఏర్పాటు చేసిన జల్‌జీవన్ మిషన్ ద్వారా రూ.80లక్షలు, నాడు-నేడు పథకంలో భాగంగా మొదటి విడతగా రూ.85 లక్షలు, రెండో విడతగా రూ.కోటి 27లక్షలు, పలు చోట్ల ప్రధాన రహదారులు, అంతర్గత రహదారుల నిర్మాణాలు చేపట్టారు. పలు సంక్షేమ పథకాలు అమలు కోసం రూ.21.89 కోట్ల నగదును నేరుగా లబ్ధిదారుల ఖాతాల్లో జమ చేశారు. మొత్తం మీద సంక్షేమం, అభివృద్ధి పనులకు నాగులాపల్లికి రూ.30 కోట్లకు పైగా నిధులు మంజూరు చేశారు.



నాగులాపల్లిలో నిర్మించిన రైతు భరోసా కేంద్రం

ఆదర్శంగా తీర్చిదిద్దేలా కృషి



నాగులాపల్లి గ్రామాన్ని ఆదర్శ గ్రామంగా తీర్చిదిద్దేందుకు కృషి చేస్తున్నాం. రాజకీయాలకు అతీతంగా గ్రామంలో సమస్యలను పరిష్కరించేందుకు పాలకవర్గం కృషి చేస్తుంది. గ్రామస్తుల సహకారంతో నాగులాపల్లిలో మరింత అభివృద్ధి జరిగేలా చర్యలు తీసుకుంటాం. ఎమ్మెల్యే రమణమూర్తిరాజు సహాయ సహకారాలతో నాగులాపల్లికి మౌలిక సదుపాయాలు కల్పించేందుకు శక్తివంచన లేకుండా కృషి చేస్తా.

–జామి చినమ్మలు, సర్పంచ్, నాగులాపల్లి

రూపుమారిన గ్రామం



నాగులాపల్లి రూపురేఖలు మారిపోయాయి. కోట్లాది రూపాయలతో నాగులాపల్లిలో పలు అభివృద్ధి పనులు జరిగాయి. రహదారులు, డ్రైన్లు వంటి పనులు అందుబాటులోకి వచ్చాయి. అలాగే ప్రజలకు అవసరమయ్యే పలు రకాల సేవలందించేందుకు ప్రభుత్వ కార్యాలయాలు అందుబాటులోకి తీసుకువచ్చారు. ప్రజల వద్దకే అధికారులు వచ్చి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తున్నారు.

–బుద్ధ అన్నపూర్ణ, గృహిణి, నాగులాపల్లి

సకాలంలో ప్రభుత్వ సేవలు



సచివాలయ వ్యవస్థ అందుబాటులోకి వచ్చాక ప్రజలకు సకాలంలో సేవలందుతున్నాయి. గతంలో ఏ పని కావాలన్నా ప్రజలు మండల కేంద్రాలకు వెళ్లాల్సి వచ్చేది. నేడు ప్రజల వద్దకే ప్రభుత్వ కార్యాలయాలు అందుబాటులోకి తీసుకువచ్చారు. స్థానికంగానే ప్రజలకు అవసరమయ్యే అన్ని రకాల సేవలు అందుతున్నాయి.

–రాయి నూకరాజు, విశ్రాంత ఎంఈవో, నాగులాపల్లి

విధిగా హెల్మెట్ ధరించాలి


హెల్మెట్లు అందజేస్తున్న ఎస్‌ఐ ప్రసాదరావు

మునగపాక: వాహనాలు నడిపేటపుడు హెల్మెట్‌లు ధరించాలని ఎస్ఐ పి.ప్రసాదరావు కోరారు. మునగపాకలోని ప్రణతి పబ్లిక్ స్కూల్‌లో గురువారం 8 సంవత్సరాల లోపు పిల్లలకు ఆయన హెల్మెట్‌లు అందజేశారు.
క్రియేటివ్ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో ఇండియన్ హెడ్ ఇంజ్యూరీ ఫౌండేషన్ సౌజన్యంతో నిర్వహించిన కార్యక్రమంలో ప్రసాదరావు మాట్లాడారు. ప్రతి ఒక్కరూ రహదారి భద్రతను పాటించాలన్నారు. క్రియేటివ్ స్వచ్ఛంద సంస్థ కార్యదర్శి మళ్ల నాగేశ్వరరావు మాట్లాడుతూ విశాఖ, అనకాపల్లి అర్బన్ ప్రాంతాల్లో 15000 మంది పిల్లలకు రహదారి భద్రతపై అవగాహన కల్పిస్తూ 5వేల హెల్మెట్‌లు అందజేయాలని నిర్ణయించామన్నారు. డాక్టర్ రవి మాట్లాడుతూ రోడ్డు ప్రమాదాలు జరగకుండా ఉండేందుకు హెల్మెట్‌లు దోహదపడతాయన్నారు. ప్రణతి పబ్లిక్ స్కూల్ ప్రిన్సిపాల్ ఆడారి సతీష్‌కుమార్ కార్యక్రమంలో పాల్గొన్నారు.

అధికారుల గైర్హాజరుపై మండల సభ్యుల ఆగ్రహం


మాట్లాడుతున్న ఎంపీడీవో సురేశ్‌కుమార్

అచ్యుతాపురం : అచ్యుతాపురం మండల పరిషత్ సర్వసభ్య సమావేశానికి అధికారుల గైర్హాజరుపై సభ్యులు మండిపడ్డారు.షెడ్యూల్ ప్రకారం పది గంటలకు మొదలు కావాల్సిన సమావేశం 11 గంటలైనా ప్రారంభం కాకపోవడంతో సభ్యులు ఒకింత అసహనానికి గురయ్యారు. దీంతో సమావేశంలో ప్రారంభంలోనే సభ్యులు అధికారుల తీరుపై ఆగ్రహం వ్యక్తం చేస్తూ సభను వాయిదా వేయాలని డిమాండ్ చేశారు. దీంతో స్పందించిన ఎంపీడీవో సురేశ్‌కుమార్ సభకు గైర్హాజరు, ఆలస్యంగా వచ్చిన అధికారులపై కలెక్టర్‌కు ఫిర్యాదు చేస్తామని తెలిపారు. పూడిమడకలో కొందరు లబ్ధిదారులకు తమకు కేటాయించిన స్థలం కంటే అదనంగా భూమిని ఆక్రమిస్తున్నారని, దీనిపై చర్యలు తీసుకోవాలని ఎంపీటీసీ వాసుపల్లి పద్మావతి డిమాండ్ చేశారు. పర్యాటక ప్రాంతంగా గుర్తింపు ఉన్న తంతడికి బస్సు వస్తున్నప్పటికీ వాడపాలెం వరకూ వెళ్లడం లేదని, ఈ సర్వీసుని తంతడి నుంచి వాడపాలెంకు పొడిగించాలని సర్పంచ్ మురళీ కోరారు. ఎంపీపీ కోన సంధ్య బుజ్జి అధ్యక్షతన జరిగిన సమావేశంలో తహసీల్దార్ సరోజిని, కో ఆప్షన్ జెడ్పీటీసీ నర్మాల కుమార్, పిన్నంరాజు వాసు, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు పాల్గొన్నారు.

69 మందికి వీల్ చైర్స్ అందజేత


దివ్యాంగులకు వీల్ చైర్స్ అందిస్తున్న ఎమ్మెల్యే జోగులు

కోటవురట్ల : పేదల చెంతకు కార్పొరేట్ వైద్య సేవలను చేర్చిన ఘనత ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతుందని పాయకరావుపేట నియోజకవర్గ ఇన్‌చార్జ్, ఎమ్మెల్యే కంబాల జోగులు అన్నారు. మండల పరిషత్ కార్యాలయం వద్ద దివ్యాంగులకు వీల్ చైర్స్ పంపిణీ గురువారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న ఆయన మాట్లాడుతూ ఆరోగ్యశ్రీ పథకం ద్వారా 2 వేల రోగాలకు చికిత్స అందుతుండగా పెద్ద పెద్ద వ్యాధులతో బాధ పడేవారికి సీఎం రిలీఫ్ ఫండ్ నుంచి రూ.లక్షలు మంజూరు చేస్తున్నారన్నారు. అవసరమైన వారికి వైద్య పరికరాలను ఉచితంగా అందిస్తున్నారు. ఈ కార్యక్రమంలో 69 మంది దివ్యాంగులకు వీల్ చైర్స్ అందజేశారు. జెడ్పీటీసీ ఉమాదేవి, వైఎస్సార్‌సీపీ రాష్ట్ర అదనపు కార్యదర్శి ఆర్ఎస్ సీతారామరాజు, వైద్యాధికారి డాక్టర్ సంతోష్‌కుమార్, ఎంపీహెచ్‌ఈవో గోవిందరావు పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీ అనుబంధ విభాగాల్లో పేటకు పెద్దపీట

నక్కపల్లి: వైఎస్సార్‌సీపీ అధినేత ముఖ్యమంత్రి జగన్ మోహన్ రెడ్డి ఆదేశాల మేరకు అనకాపల్లి జిల్లా వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అనుబంధ విభాగాల నియామకం జరిగింది. ఈ నియామకాలు(పార్టీ పదవుల్లో) పాయకరావుపేట నియోజకవర్గానికి పెద్దపీట వేశారు. అనుబంధ విభాగాల వారీగా నియామకాల వివరాలిలా ఉన్నాయి. బీసీ విభాగం జిల్లా అధ్యక్షుడిగా పైలా రమేష్, ఉపాధ్యక్షుడిగా గొర్ల గోవిందరావు, ప్రధానకార్యదర్శిగా ,యజ్జల సత్యనారాయణ, జిల్లా కార్యదర్సులు మనబాల తాతారావు, వైబోయిన సత్యనారాయణ, కోశెట్టి లోవరాజు, పచ్చల నానాజీ, పిక్కి నూకరాజు, ఎం.వరహాల బాబు నియమితులయ్యారు. క్రిస్టియన్ మైనార్టీ విభాగం ప్రధాన కార్యదర్శిగా జాన్‌డేవిడ్ కుందూరు, కార్యదర్శులుగా చిత్రాడ ప్రకాష్, కె.రమేష్ నియమితులయ్యారు. కల్చరల్ విభాగం నుంచి పేరూరి వినోద్ కుమార్ ప్రధాన కార్యదర్శిగా నియమితులయ్యారు. ఐటీ విభాగం జిల్లా అధ్యక్షుడిగా పోతంశెట్టి రాజేష్, ఉపాధ్యక్షుడిగా నల్లల రామకృష్ణ, ప్రధాన కార్యదర్శులుగా మహ్మద్ షాద్, బి.మల్లికార్జున్, శెట్టి బాబ్జి, సహాయకార్యదర్శిగా కె.బాబ్జి, మహిళా విభాగం నుంచి ప్రధాన కార్యదర్శిగా వీసం వెంకటలలిత, కార్యదర్సులుగా నారపురెడ్డి కుమారి, షేక్ సుబాన్ బీబీ, పి.సీ తారత్నం, గొంతురాజు, గీసాల పద్మావతి, వంతర వెంకటలక్ష్మి, కొంతం వరలక్ష్మి నియమితులయ్యారు.
ముస్లిం మైనారిటీ విభాగం జిల్లా అధ్యక్షుడిగా తాజుద్దీన్ బాబా, ప్రధాన కార్యదర్శిగా ఎస్ఎస్ మీరా, ఎండీ గౌస్, కార్యదర్శులుగా ఎండీ ఉమర్, ఇషాక్, హుస్సేన్, ఎండీ అన్సర్, ఫాతిమా మున్నీసా, ముస్తాఫా, ఖాసీం సాహెు, జామిల్ హుస్సేన్ నియమితులయ్యారు. పంచాయతీరాజ్ విభాగం ప్రధాన కార్యదర్శిగా దేవవరపు వెంకటేశ్వరరావు, కార్యదర్శిగా కరణం ఈశ్వరరావు, చోడిపల్లి గోవిందు నియమితులయ్యారు. రైతు విభాగం కార్యదర్శులుగా గంగిరెడ్ల వెంకటరమణ, ఎరిపల్లి నాగేసు నియమితులయ్యారు. ఎస్సీ సెల్ కార్యదర్శులుగా వేమగిరి లక్ష్మణరావు, కాకర వెంకటరావు, కశింకోట హనుమంతరావు, కుంచా కాసులు, మైలపల్లి త్రిమూర్తులు, బోడపాటి గోవిందు, యాదాల శ్రీను నియమితులయ్యారు. ఎస్టీ సెల్ ఉపాధ్యక్షుడిగా కోనాల శ్రీను, స్టూడెంట్ విభాగం జిల్లా అధ్యక్షుడిగా కొప్పిశెట్టి హరిబాబు, ప్రధాన కార్యదర్శిగా చేపల మనోజ్, కార్యదర్శిగా కలెంపూడి శ్రీను నాయుడు నానాజీ, దాడి సురేష్, కర్రి గణేష్ నియమితులయ్యారు. వాణిజ్య విభాగం ప్రధాన కార్యదర్శిగా దమ్ము వెంకటరమణ, కార్యదర్శిగా అనకాపల్లి శివకుమార్, గొల్ల లోవరాజు, ఇసరపు వీర సురేష్ , చేనేత విభాగం ఉపాధ్యక్షుడిగా కొమ్మన వెంకటేశ్వరరావు, ప్రధాన కార్యదర్శిగా గొడుగుల బంగార్రాజు, జాగు కొండబాబు, కార్యదర్శులుగా కల్లూరి బాబ్జి, బడిగంటి నాగ చిరంజీవి, పి.నాగేశ్వరరావు, టి.ఎస్. హనుమంతరావు, ఇందన రాములు, యువజన విభా గం జిల్లా ప్రధాన కార్యదర్శులుగా తళ్ల భార్గవ్, బొగ్గు బాలాజీ, కార్యదర్శులుగా చామంతుల శ్రీనివాసరావు, సాదిరెడ్డి శ్రీనివాస్, కాకర శివకుమార్, వైఎస్సార్ సేవాదళ్ జిల్లా ఉపాధ్యక్షుడిగా కొప్పిశెట్టి రామ్మోహన్, కార్యదర్శులుగా అల్లురమణ, జొన్నికూటి సూరిబాబు, సలికె అచ్చీలు, తుమ్మలపల్లి శ్రీనివాస అర్జునరావు, దంతులూరి వనంరాజు, వైఎస్సార్‌టీయూసీ నుంచి ఉపాధ్యక్షుడిగా దేవవరపు వెంకటేశ్వరరావు, కార్యదర్శిగా పాలపర్తి సతీష్ నియమితులయ్యారు.

19న హరిగిరి కనకదుర్గమ్మ గుడి విగ్రహ ప్రతిష్ట

అచ్యుతాపురం : ఈ నెల 19న హరిపాలెం హరిగిరి కనకదుర్గమ్మ విగ్రహ ప్రతిష్ట చేయనున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. ఈ మేరకు 16 నుంచి హోమాలు, ఊరేగింపులు జరపనున్నట్లు వారు పేర్కొన్నారు. విగ్రహ ప్రతిష్ట రోజున భారీ అన్న సమారాధన కార్యక్రమం చేపట్టనున్నట్లు వారు తెలిపారు.

నేడు మున్సిపల్ కౌన్సిల్ సమావేశం

యలమంచిలి : యలమంచిలి మున్సిపల్ కార్యాలయంలో శుక్రవారం ఉదయం 11 గంటలకు కౌన్సిల్ సమావేశం మున్సిపల్ చైర్‌పర్సన్ పిళ్లా రమాకుమారి అధ్యక్షతన జరగనుందని మున్సిపల్ కమిషనర్ కె.కొండలరావు గురువారం సాయంత్రం తెలిపారు. ఈ సమావేశానికి యలమంచిలి మున్సిపల్ కౌన్సిల్ సభ్యులు, మున్సిపల్ అధికారులు, సంబంధిత అన్ని శాఖల అధికారులు హాజరు కావాలని కోరారు.

పాండురంగస్వామి కల్యాణ మహోత్సవం

పాయకరావుపేట: పట్టణంలో గల శ్రీ రాధా రుక్మిణీ సహిత పాండురంగ దేవస్థానంలో స్వామి కల్యాణం వైభవంగా నిర్వహించారు. ఈ నెల 15 నుంచి 21 వరకు ఆలయంలో శ్రీ పాంచరాత్ర మోక్ష ప్రకారం స్వామి కల్యాణోత్సవాలు నిర్వహణ జరుగుతుందని ఆలయ కార్యనిర్వహణాధికారి ఎన్.వెంకటాద్రి తెలిపారు. ఆలయ అర్చకులు యియ్యుణ్ణి కృష్ణ స్వామి వేద మంత్రాలతో స్వామి కళ్యాణం నిర్వహించారు. పలువురు భక్తులు హాజరై కల్యాణోత్సవాన్ని తిలకించారు. భక్తులకు ఆలయ అర్చకులు తీర్థ ప్రసాదాలను అందించారు.

పారిశుధ్యం మెరుగుకు సహకరించండి

మునగపాక : ప్రతి ఒక్కరూ పారిశుధ్యం మెరుగునకు సహకరించాలని మునగపాక సర్పంచ్ దిమ్మల అప్పారావు కోరారు. మునగపాక ఒకటవ వార్డులో ఆయన గురువారం రాత్రి తడి,పొడి చెత్త బుట్టలను పంపిణీ చేశారు. మహిళలు తమ ఇళ్లలోని చెత్తను వేర్వేరుగా బుట్టల్లో వేయాలన్నారు. తడి,పొడి చెత్త సేకరణ ద్వారా సంపదతయారీ కేంద్రానికి ఆదాయం సమకూరుతుందన్నారు. కార్యక్రమంలో వార్డు సభ్యుడు కొయిలాడ రామచంద్రరావు పాల్గొన్నారు.

ప్రకృతి వ్యవసాయంతో ఆరోగ్యం

కశింకోట :ప్రకృతి వ్యవసాయం సాగు ద్వారా భావి తరాలకు ఆరోగ్యాన్ని అందివ్వాలని ప్రకృతి వ్యవసాయం జిల్లా ప్రాజెక్టు మేనేజర్ సిహెచ్.లచ్చన్న అన్నారు. మండలంలోని విసన్నపేట గ్రామంలో ప్రకృతి వ్యవసాయం సాగుపై గురువారం అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రైతులు సేంద్రియ పద్ధతులు పాటించి పంటలను సాగు చేయాలన్నారు. తద్వారా ఆరోగ్యకరమైన వ్యవసాయ ఉత్పత్తులను ప్రజలకు అందించడానికి దోహదపడాలన్నారు. వ్యవసాయ క్షేత్రాల్లో పంటల సాగుకు ఐదు అంచెల పద్ధతి అనుసరించాలన్నారు.

రైల్వే డీఈఈని కలిసిన వైఎస్సార్‌సీపీ నాయకులు


విజయవాడలో రైల్వే డీఈఈని కలిసిన వైఎస్సార్‌సీపీ నాయకులు

నక్కపల్లి : మండలంలో మెరక గ్రామాల్లో నెలకొన్న విద్యుత్ సమస్యలు పరిష్కరించేందుకు కొత్త విద్యుత్ లైన్లు ఏర్పాటు విషయమై రైల్వే శాఖ అనుమతి కోసం వైఎస్సార్‌సీపీ నాయకులు గురువారం రైల్వే డీఈఈ సురేష్‌బాబును కలిశారు. మండలంలో దొంకాడ, జగన్నాథపురం, కొత్తూరు, సీతానగరం, దోసలపాడు, రమణయ్యపేట, చీడిక తదితర గ్రామాలకు కొద్ది సంవత్సరాలుగా విద్యుత్ సరఫరా సక్రమంగా జరగడం లేదు. రేబాక ఫీడర్ నుంచి సరఫరా ఇస్తున్నప్పటికీ తరచూ అంతరాయం ఏర్పడుతోంది. సమీపంలో గొడిచర్లలో సబ్‌స్టేషన ఏర్పాటు చేసినప్పటికీ రైల్వే ట్రాక్ అడ్డుగా ఉండడం వల్ల విద్యుత్ లైన్లు ఏర్పాటు చేయలేదు. ఈ నేపథ్యంలో గురువారం వీసం రామకృష్ణ, వైస్ ఎంపీపీ వీసం నానాజీ, ఎంపీటీసీ గొర్ల గోవిందు ట్రాన్స్‌కో ఏఈ రామకృష్ణలు విజయవాడలో దక్షిణ మధ్య రైల్వే డీఈఈ సురేష్‌బాబును కలిశారు. రైల్వే అండర్ బ్రిడ్జి కింద నుంచి కేబుళ్లు ఏర్పాటుకు అనుమతి కావాలని దరఖాస్తు ఇచ్చారు. తమ సిబ్బందిని పంపించి నివేదిక తెప్పించుకున్న తర్వాత పరిశీలించి అనుమతి మంజూరు చేస్తామని, దీనికి అవసరమైన అన్ని సెక్యూరిటీ డిపాజిట్లు చెల్లించాల్సి ఉంటుందని సురేష్‌బాబు తెలిపినట్టు వీసం తెలిపారు.

నాలుగో విడతలో రూ.16.45 కోట్ల రుణమాఫీ

జగనన్న చిత్రపటానికి డ్వాక్రా మహిళల క్షీరాభిషేకం


డ్వాక్రా మహిళలకు నాలుగో విడత ఆసరా చెక్కు అందజేస్తున్న జోగులు


సీఎం జగన్‌కు ధన్యవాదాలు చెబుతూ చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న దృశ్యం


కోటవురట్లలో ఆసరా చెక్కు పంపిణీ

ఎస్.రాయవరం : చెప్పిన మాట ప్రకారం అక్క చెల్లెమ్మలను ఆదుకున్న ఘనత సీఎం జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతుందని పాయకరావుపేట సమన్వయకర్త, రాజాం ఎమ్మెల్యే కంబాల జోగులు అన్నారు. మండల కేంద్రంలో గురువారం నాలుగో ఆసరా వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఎస్.రాయవరం మండలంలో 1851 సంఘాలకు , 18,458 మందికి నాలుగు విడతలుగా రూ.65.84 కోట్లు రుణమాఫీ చేశారన్నారు. నాలుగో విడతగా రూ.16.45 కోట్ల చెక్కును మండల స్వయం సంఘాల సభ్యులకు అందజేశారు. అదే క్రమంలో స్త్రీనిధి రుణాలు 1713 మంది సభ్యులకు రూ.8.63కోట్లు చెక్కును అందజేశారు. డ్వాక్రా మహిళలతో కలిసి కంబాల జోగులు సీఎం జగన్‌మోహన్‌రెడ్డి చిత్రపటానికి క్షీరాభిషేకం చేసి కృతజ్ఞతలు తెలిపారు. ఈ నగదు త్వరలో అకౌంట్లలో జమ అవుతాయన్నారు. రానున్న ఎన్నికల్లో ఫ్యాను గుర్తుపై ఓటు వేసి మళ్లీ జగనన్నను సీఎంగా చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్సీ సూర్యనారాయణరాజు, ఎంపీపీ లోవలక్ష్మి, జెడ్పీటీసీ కాకర దేవి, మాజీ ఎంపీపీ శారదాకుమారి, వైఎస్సార్‌సీపీ జిల్లా కమిటీ కన్వీనర్ కొణతాల శ్రీనివాసరావు, సర్పంచ్‌లు భూపతి అప్పారావు, కొప్పిశెట్టి సత్యం, వైఎస్సార్‌సీపీ మండల పార్టీ అధ్యక్షుడు గోవిందరావు, ఎంపీపీ చోడిపల్లి అప్పన్న, వైఎస్సార్‌సీపీ నాయకులు శ్రీపతి రాజు, పోలిశెట్టి పెద ఈశ్వరరావు, వైఎస్సార్‌సీపీ మండల యువజన విభాగ అధ్యక్షుడు నల్లపరాజు వెంకటరాజు, వైఎస్సార్‌సీపీ పోచిన నరేష్, మార్కెట్ కమిటీ డైరెక్టర్ అద్దేపల్లి బొజ్జన్న, ఐకేపీ ఏరియా కోఆర్డినేటర్ సత్యవేణి, ఏపీఎం శివప్రసాద్ పాల్గొన్నారు.

మీకోసం 156 సార్లు బటన్ నొక్కారు..

కోటవురట్ల : అక్కా చెల్లెమ్మలందరూ బాగుండాలని, పిల్లలకు బంగారు భవిష్యత్‌ను ఇవ్వాలని ఈ ఐదేళ్లలో సీఎం జగన్‌మోహన్‌రెడ్డి 156 సార్లు బటన్ నొక్కారని, ఈసారి మీరంతా మళ్లీ మన కోసమే రెండు బటన్లు నొక్కి వైఎస్సార్‌సీపీ ప్రభుత్వాన్ని తెచ్చుకోవాలని పాయకరావుపేట నియోజకవర్గ ఇన్‌చార్జ్, ఎమ్మెల్యే కంబాల జోగులు పిలుపునిచ్చారు. మండల పరిషత్ ఆవరణలో వైఎస్సార్ ఆసరా సంబరాలను గురువారం నిర్వహించారు. మనసున్న గొప్ప నాయకుడు జగన్ అని సామాజిక న్యాయం కోసం 25 మంత్రులలో 17 మంత్రి పదవులను ఎస్సీ, ఎస్టీ, బీసీలకే కల్పించారన్నారు. మాజీ ఎమ్మెల్సీ డి.వి. సూర్యనారాయణరాజు మాట్లాడుతూ డ్వాక్రా అక్కా చెల్లెమ్మలకు సీఎం జగన్ అండగా ఉంటూ ఈ ఐదేళ్లలో పాయకరావుపేట నియోజకవర్గానికి వైఎస్సార్ ఆసరా ద్వారా రూ.125 కోట్లు అందించారన్నారు. జెడ్పీటీసీ సిద్దాబత్తుల ఉమాదేవి మాట్లాడారు. లబ్దిదారులతో కలిసి ఎమ్మెల్యే జోగులు సీఎం జగన్ చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ రాష్ట్ర అదనపు కార్యదర్శి సీతారామరాజు, జోన్ 1 ఎస్సీ సెల్ ఇన్‌చార్జ్ కంబాల సందీప్, ఎంపీపీ అప్పలనాయుడు, వైఎస్సార్‌సీపీ జిల్లా కార్యదర్శి యల్లపు కుమారరాజా, సర్పంచ్ అనిల్‌కుమార్, వైఎస్సార్‌సీపీ నాయకులు సత్యనారాయణ, శ్రీపతిరాజు, శెట్టి రమణ, ఎంపీటీసీ రాంబాబు, ఎంపీడీవో కాశీవిశ్వనాథరావు, ఏపీఎంలు రమణకుమారి, కరుణానిధి పాల్గొన్నారు.

ఇన్‌స్పైర్ ప్రదర్శనలో జంపపాలెం విద్యార్థుల ప్రతిభ


తాము రూపొందించిన ప్రాజెక్టుతో జంపపాలెం విద్యార్థులు

యలమంచిలి రూరల్: జంపపాలెం జెడ్పీ పాఠశాల విద్యార్థులు ముత్యాల నాగశివ(10వ తరగతి),బల్లా వెంకటేష్ (9వ తరగతి) రైల్వే స్టేషన్లలో ప్లాట్‌ఫాంలపై ప్రమాదాలను అరికట్టేందుకు రూపొందించిన ఇన్‌స్పైర్ ప్రాజెక్టు జిల్లా స్థాయిలో మొదటి స్థానంలో నిలిచింది. రైలు ఆగినపుడు ఆటోమేటిక్ హైడ్రాలిక్ సిస్టంలో ఫ్లాట్‌ఫాం ఎక్స్‌టెన్షన్ అయ్యేలా రూపొందించిన ప్రాజెక్టు సెలెక్టర్ల దృష్టిని ఆకర్షించింది. ఈ విధానం ద్వారా రైలు ఆగినపుడు బోగీలకు, ప్లాట్‌ఫాంకు మధ్య ఖాళీ లేకుండా ఒక ప్రత్యేకమైన రేకులాంటి అమరిక ఏర్పాటు చేస్తారు. ఇది ముందుకు, వెనుకకు కదిలే విధంగా ఉంటుంది. రైలు వెళ్లిన తర్వాత యథావిధిగా ప్లాట్‌ఫాం అంచుకు ముడుచుకుపోతుంది. ఈ తరహా ప్లాట్‌ఫాం ఎక్స్‌టెన్షన్‌తో రైల్వే స్టేషన్లలో జరిగే ప్రమాదాలు అరికట్టవచ్చని బాల మేధావులు చెబుతున్నారు. తాము రూపొందించిన ప్రాజెక్టు రాష్ట్ర స్థాయికి ఎంపిక కావడం ఆనందంగా ఉందని విద్యార్థులు తెలిపారు. పాఠశాల ప్రధానోపాధ్యాయుడు ఏవీహెచ్ శాస్త్రి విద్యార్థులు, వారికి గైడెన్సునిచ్చిన సైన్సు ఉపాధ్యాయుడు కొయిలాడ రమణ అప్పలనాయుడులను అభినందించారు.